# జరుగుతున్న నిజం

## చావా శివకోటి

**రాత్రి నడిఝాము దాటుతున్నది. సన్నజాజి పందిరిలా వుంది అకాశం. అప్పుడొచ్చాడు ఆచారి. ఆచారి ఆ నాల్గు పల్లెలకూ వైద్యుడు. ఎం.బి.బి.ఎస్. కాదు ఆర్.ఎం.పి. ఆయనే ఆ పల్లెకు వైద్యుడిగా ముఖ్యుడయ్యాడు.**

ఆచారి, టౌన్‌లో వైద్యుల వద్దా ల్యాబులలో ఈ నెల రావాల్సి కమిషను తీసుకునేసరికి అక్కడే ఆలస్యమైంది. రెండు రొట్టెలు తిని బయలుదేరాడు. ఇంటికి చేరేసరికి మరో అరగంట. టౌను నుంచి పల్లెకు చేరాలి గదా! వస్తూ వస్తూ ఆసుపత్రి వైపు చూశాడు. ఆసుపత్రంటే, మరేదో అనుకునేరు. నాల్గు స్తంభాల పాకా, ఓ గదీను.



అలికిడి అనిపించలేదు. సరాసరి ఇంటికి వచ్చాడు.

స్కూటరు ఆపి దిగుతుండగా, ఇంటికి కొద్దిగా ఎడంగా, ఎడ్లబండి కనిపించింది. 'ఆపద' ఉన్న కేసేదో వచ్చి ఉంటుందను కున్నాడు. వరండాలోకి రాగానే ఓ ముసలమ్మ పసివాణ్ణి ఒళ్ళో కూర్చుండబెట్టుకొని జోకొడుతూ కథ చెపుతూ కనిపించింది. పిల్లాడు ఊకొడుతూ ఆవిడ ముఖంలోకి చూస్తున్నాడు.

ఆ దృశ్యం కనిపించాక ఆచారికి ఆయన పసితనం గుర్తుకొచ్చింది. ఆచారికి ఓ జేజమ్మ ఉండేది. ఆవిడ ఇలాగే కథలు చెపుతూ నిద్రపుచ్చేది. "ఎంతటి మధురమైన రోజులవి" అనుకున్నాడు. ముసలమ్మ చెపుతున్న కథ నెమ్మదిగా వినిపించింది.

రాజకుమారుణ్ణి రాణి అడిగింది.

"తెల్ల కాకులుండేది ఎక్కడా?" అని.

"దాన్ని ఓ రాజు పాలిస్తున్నాడు. అతని పేరేమిటి? ఈ ప్రశ్నలకు మూడు దినాలలో సమాధానం చెప్పగల్గినవానికి మరో పరీక్ష ఉంది. దాన్ని నెగ్గగల్గితే పాణిగ్రహణం" అంది.

"అలాగే" అని రాజకుమారుడు సెలవు తీసుకొని తన రాజ్యానికొచ్చి పంచకళ్యాణిని ఎక్కాడు. గుర్రం కదం తొక్కుతూ నడుసున్నది. నగరాలూ, నదులూ, అడవులూ దాటింది. అలుపెరుగక గుర్రం లగెత్తుతూనే ఉంది. "కన్నలూ అరేయ్ వింటున్నావా?" అనడిగింది. పిల్లాడు నిద్రకు జోగుతూ కనిపించాడు. బదులు చెప్పలేదు. "హరీ భడవా! నాకు చెప్పకుండానే నిద్రపోతున్నావా?" సరేలే మిగిలింది రేపు చెబుతాను" అని పిల్లాడ్ని చాప పైకి జరిపి లేచి నొప్పితో బాధపడుతున్న బిడ్డ దగ్గరకు చేరి "అమ్మా! చెంచిలూ నొప్పెలా ఉందిరా?" అని "ఈ డాక్టరేమో ఇప్పటికీ రాలేదాయే. నువ్వేమో నొప్పితో సుడులు తిరుగుతుంటివి" అని నుదిట చెయ్యేసి చూసింది. అటు తిరిగి కళ్ళు వత్తుకున్నది.

"పిల్లాడు నిద్రలోకెళ్ళకుంటే కథంతా విందును గదా!" అనిపించింది ఆచారికి.

ఈ మనిషి జన్మ చిత్రాతిచిత్రమైనది. ఒంటరిగా లోకంలోకొస్తాడు. పసితనంలో తల్లి నీడన, తండ్రి జాడన మెదులుతాడు. తరువాత పదిమందిలో కలుస్తాడు. నేను అనేది ప్రారంభమైనాక, కష్టసుఖాలలోకి అడుగుపెడతాడు. ఇవి ఎంత సంపాదించినా స్థితిగతులను ఎంతగా పెంచినా వదలిపోవు. సంపాదనతో పాటు అవీ పెరుగుతూనే ఉంటాయి. ఇది మననంలోకి వస్తున్నా మనిషి ఆగడు. ఊరుకోడు. సమాజపుటీరుసున పడి మెదలాడుతూనే ఉంటాడు. కల మెలగడం మాత్రం ఆపడు. అలా మెలుగుతూనే ఒంటరిగా అందర్నీ వదిలి అర్థాంతరంగా పోతాడు. అసలు పుట్టుకేమిటో, చావేమిటో, బ్రతుకేమిటో అర్థమయినట్టుగా అనిపిస్తూ బొత్తిగా అర్థం కాకున్నా వరవడి మాత్రం ఇదే. చావు పుట్టుకల ఆటే ఈ 'లోకచరిత్ర'. 'నాది నాది' అంటూ దయా దాక్షిణ్యాలకు ఉశ్చనీచాలను వదలి ఆబగా పరుగెత్తి కాలగమనంలో అనామకంగా అనూహ్యంగా కలిసిపోయే మనిషి వింత కథ.

లోనికెళ్ళి లైటేశాడు ఆచారి.

"అమ్మా! లైటు వెలిగిందే. డాక్టరుగారు గానీ వచ్చాడేమో కాస్త చూడు" అంది రోగి ఆపసోపాలు పడుతూ ఆశగా.

"ఆ ఆ అవునోయ్ వెళ్తున్నా" అంటూ వేగంగా అటు నడిచింది అవ్వ. ఇంతలో బండి దగ్గర కునికిపాట్లు పడుతున్న పాలేరు అవ్వదగ్గరకొచ్చి ఎడ్లకి మేత వేసి నీళ్ళెట్టి నేను కూస్త బండి తొట్లో కూచుని కునుకు తీస్తా. ఏదైనా అక్కరొస్తే 'కూక ఎయ్యండి వచ్చేస్తా' అని చెప్పాడు.

"అట్టాగే లేరా" అని ఆచారి గది దగ్గరకు నడిచింది. ముసలమ్మ మాటలు వినిపించి ఆచారి బయటకొచ్చాడు. తలుపు తెరిచాడు. ఎదురుగా కనిపించిన అవ్వను చూసి 'ఏం కావాలి?' అనడిగాడు. "డాక్టరు బాబా నేనొచ్చి ఎంత కాలమైందనుకుంటున్నారు! మాపటేల నుంచీ మీరు వస్తారని ఎదురు చూస్తున్నా. అదిగో, ఆ మంచం పక్కన ఉంది అదే నా బిడ్డ. పేరు చెంచిత. వల్లమాలి

కడుపు నొప్పితో మెలి తిరిగిపోతున్నది. ఉడుకు నీళ్ళెట్టి, ఉప్పు సెగజేసి, ఆరంగ ఆరంగ కాపుతున్నా. పొద్దుట ఇన్ని వాంపాలు పోసిన శొంఠి కలిపి. మరి అదేమయిపోయిందో నొప్పి మాత్రం తరగడం లేదు. తెరలు తెరలుగా వచ్చి పసిదాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. చస్తే బాగుండునని మొత్తుకుంటున్నది. మధ్యాహ్నం తరువాత దాని బాధ చూడలేక సవారి బండిలో ఈడకు చేరాను. వంటికి బాధ వచ్చినోడు వైద్యుడి దగ్గరికి రాక ఎటు పోతాడు. వచ్చినాక వానికి ఉపశమనం కల్గించడం వైద్యుడి వంతు. ఏమంటావు?" అంది ఆచారినే చూస్తూ.

"మంచి మాటకారే ముసల్ది" అనుకొని, "ఏది ఏమైనా ఇప్పుడే ఈ పిల్లను చూడాలి. లేకుంటే ఈ ముసల్ది వదల్దు" అనిపించి "పద" అన్నాడు. స్టెతస్కోపు తీసుకుని నడిచాడు. "పద" అన్నమాట ముసల్దాని మొఖాన కాంతిని నింపింది. సంతోషంగా వెనక్కి తిరిగి బిడ్డ దగ్గరకు నడిచింది. డాక్టరుగారివైపే ఉన్నాయి చూపులు బిడ్డను చేరాక కూడా. ఆయన గడప దాటగానే బిడ్డవైపు మళ్ళలేదు. వరండా మూలన గొంగళిని మడుకుచొని అదోలా మూల్గుతున్న ఆవిడ దగ్గరికొచ్చి ఆగాడు ఆచారి. అక్కడే నిలబడి బిడ్డను చూపుతోంది అవ్వ. ఆచారి అక్కడ ఆగి చెంచితను చూశాడు. చెక్కిన రాతిబొమ్మలా అనిపించింది. కాకుంటే నల్లగా ఉంది. నెమ్మదిగా లేచి కూర్చునే ప్రయత్నం చేసింది చెంచిత.

"అక్కర్లేదు. నువ్వలాగే ఉండు" అని ఆచారి పక్కనే కూర్చున్నాడు. స్టెతస్కోపులో చెంచితను పరీక్షిస్తూ "నొప్పి ఎక్కడ?" అనడిగాడు.

ఆనక -

పొత్తికడుపుపై రెండు చేతులూ ఉంచి, రకరకాలుగా ఒత్తి చూశాడు. ఈ నొప్పి ఎప్పుడు వస్తుంది? ఎప్పుడు తగ్గుతుంది? ఏం తింటే వస్తుంది? అనడిగాడు. అంత బాధలోనూ సర్దుకుంది చెంచిత. ఆచారి చేతిని మొదట విదిలించేసింది. ముసల్ది వారించిన మీదట ఆగింది. "నేను డాక్టరును తల్లీ. అలా విదిలిస్తే నేను పరిక్షించడం ఎలా చెప్పు? చూడకపోతే విషయం అర్థం కాదు గదా. కొంచెం ఓపిక చెయ్యి" అని అవ్వవైపు తిరిగి "నీకేమవుతుంది" అనడిగాడు.

"బిడ్డ"

"అది సరే! నీ పేరు చెప్పలేదేం? నేను రాసుకోవాలిగదా!" అన్నాడు చెంచితతో. చెప్పింది మెలితిప్పుతున్న బాధను అదుము కుంటూ. "ఈ నొప్పి పెద్దదానివయినప్పటి నుంచీ ఉందా? లేక కొత్తగా వచ్చిందా? వచ్చే ముందెలా ఉంటుంది. నొప్పి తగ్గాక స్థితేమిటి?" అని అడుగుతూ కళ్ళ కింద రెప్పను లాగి చూశాడు.

"ఇది మొదలయి ఆరు నెలలయింది. కాపురానికొచ్చిన మొదట్లో కొంచెం ఉండేది. కానీ రెండు నెలల కాపురం తరువాత లేదు. మళ్ళా మొదలయి ఆరేడు నెలలయింది అంతే." "ఈ మధ్యనే ప్రారంభమైందన్నమాట" అని తల వూపి అమ్మాయి చేయి పుచ్చుకుని నాడి చూస్తూ "ఇదిగో చెంచితా నొప్పి కరెక్టుగా ఎక్కడ ప్రారంభమయిందో చూపగలవా?" అని అడిగాడు.

తల ఊపింది.

నెమ్మదిగా సర్దుకొని చూపింది. భయంగా డాక్టరు వైపు చూసింది.

"అది సరే! నువ్వు బయట ఉండేదానికి ముందూ వెనకా నొప్పి ఎలా ఉంటుంది? "ముందు వచ్చే నొప్పి రెండు మూడు పూటల కంటే ఎక్కువ ఉండదు. ఆ తరువాత నాలుగు రోజులు మాత్రం నొప్పి ఆగడం లేదు. ఎప్పుడు ఆగుతుందో తెలీదు. ఒక్కోసారి ఒక్కో రకంగా బాధిస్తున్నది" అంది.

"నీకు పిల్లలెందరు? ఈ నొప్పి పిల్లలు కలుగక ముందు కూడా ఉందా?"

"నాకసలు పిల్లలు లేరు"

"మీ ఆయన వచ్చారా?"

"రాలేదు"

"నువ్వు కాపురానికొచ్చి ఎన్ని రోజుల యింది?"


"దాదాపు నాల్గు సంవత్సరాలు కావచ్చు, కొన్ని నెలలూ"

"మంచిది" అన్నాడు పూర్తిగా వినకుండానే. స్టెతస్కోపు చెంచిత వంటిపై నుంచి తీసి

"నీ చెయ్యి ఇలా ఇవ్వు" అన్నాడు.

ఇచ్చింది బెరకుగా.

పట్టుకొని మళ్ళీ నాడి చూశాడు. ఆనక లేచి అవ్వ వైపు తిరిగి "రేపు పొద్దుటే రెండు పరీక్షలు చేయాలి. వాటినిబట్టి వైద్యం చేద్దాం"



అన్నాడు. చెంచితకు నొప్పి తగ్గలేదు. మూల్గుతూనే ఉంది.

"మరి ఇప్పుడు?" అంది అవ్వ.

అప్పటిదాకా వీటిని వాడండి అని రెండు బరాల్గన్ మాత్రలిచ్చాడు. మంచినీళ్ళు తెచ్చి ఓ మాత్రను వెంటనే మింగించింది. ఆచారి తన గదిలోకి వెళ్ళిపోయాడు. బండి తొట్లో పడుకుని గుర్రుకొడుతున్న పాలేరు దగ్గరకెళ్ళి వాడ్ని నిద్ర నుంచి లేపింది అవ్వ. ఉలిక్కిపడి లేచాడతను. "పిలవగానే పలికేట్టుండాలిగానీ ఏంర్రా ఆ మొద్దు నిద్ర?" అని మందలించి బండెలో

*(మిగతా 39వ పేజీలో చూడండి)*

"నీళ్ళయిపోలాగున్నాయి కానీ, వాటిని పారబోసి నీళ్ళు నింపుకొని రా" అంది. తలూపి వెళ్ళి పోయాడు అతను. నెమ్మదిగా బిడ్డ దాపుకు చేరింది. పొత్తికడుపు పైన చేయి వేసి నిమిరింది. అయినా మూలుగు ఆగలేదు. బాధ తగ్గలేదు.

"మందు మింగావు కదా! తగ్గుతుందిలే కూస్తంత ఓపిక చేసుకోవాలే" అంది కడుపు నొప్పి అనగానే మన డాక్టరు మహాశయులు కళ్ళు మూసుకొని 1+1=2 లా బెరాల్గన్ మాత్ర రాస్తారు. ఈ మాత్రవల్ల ఆడవారికి అనేక అనర్థాలొస్తున్నాయని చివరకు నిస్సంతుల్నిగా కూడా చేస్తుందని పరిశోధనల ఫలితాల్ని చూసి అనేక దేశాలు నిషేధించాయి. కానీ మన వాళ్ళు రాస్తూనే ఉన్నారు. రాసిస్తున్నారు గనుక వినియోగం కొరకు మందుల షాపు వాళ్ళు తెస్తూనే ఉన్నారు. జనం తింటూనే ఉన్నారు.

ఆచారి చెంచిత చేయి పుచ్చుకున్నాడు.

"జ్వరం లేదు. తగ్గింది" అన్నాడు. చెంచిత శరీరాన్ని తడుముతున్నప్పుడు అక్కడక్కడా బిరుసుగా తగిలింది. మళ్ళీ మళ్ళీ పరీక్షించాడు. చెంచిత సిగ్గుతో ముడుచుకుపోయింది. అది గమనంలో కొచ్చాక ఆచారిలో మరో భావన కలిగింది. అలా చూస్తూ పోయాడు.

అమాయకత మూర్తీభవించిన అందాల బొమ్మగా అనిపించింది. ఆడతనానికి ఏ అవయవం ఎలా ఉండాలో, అలా కుదురుగా ఉండి గొప్పగా అనిపించి అలాగే చూస్తుండేలా చేసింది. చెంచిత చీరను చీల్చుకొని ఆచారి ఆలోచనలు ముందుకు నడిచినయ్. ఓ క్షణకాలం అదే భావనలో ఉంది. సర్దుకొని అక్కడి నుంచి లేచి రూంలోకెళ్ళాడు.

గాలికి ఎగురుతున్న విస్కీ కంపెనీవారు ఇచ్చిన పన్నెండు పేజీల నగ్న సుందరీమణుల విన్యాసాలతో ఉన్న క్యాలెండరు, వారి నిండైన అవయవ సంపదా వా వా అని దగ్గరకు ఆహ్వానించినట్లనిపించింది.

✻ ✻ ✻

"డాక్టరు బాబూ!" అన్న అరుపు వినిపించింది.

## జరుగుతున్న నిజం

*(35వ పేజీ తరువాయి)*

"ఈ ముసల్ది ఈ పొద్దు నిద్రపోనివ్వదు. తను నిద్రపోదు" అనుకొని నెమ్మదిగా లేచి బయటకొచ్చాడు ఆచారి.

"పిల్లదానికి నయమవుతుందంటారా?" అనడిగింది కంట్లో నీరు తిరిగి దొర్లుతుంటే.

"అంత ప్రమాదమేం లేదు. కాకపోతే రెండు పరీక్షలున్నాయి. అవి రాగానే మందులు రాసిస్తాను. వాటిని వాడితే గుణం కనిపిస్తుంది"

"పిల్లది ఎంగిలి పడలేదు. ఇన్నిజావకాసి పోయానా?" అనడిగింది.

"ఇప్పుడా?"

"ఏం"

"ఏం ఇంటి దగ్గర నుంచి ఏం తేలేదా?"

"జొన్న రొట్టెలున్నాయ్"

"బంగారంలా తినిపించండి. కావాలంటే గ్లూకోజ్ పాలలో వేసి ఇవ్వండి"

మంచిది అన్నట్టు తల ఊపి వెనక్కి తిరిగింది.

ఆచారి తలుపులు మూసుకొని రెండు పెగ్గులు విస్కీ తాగి పడుకున్నాడు.

నిద్ర. నిద్రలో కల. కలలో చెంచిత. అంతటితో ఆగక ఏటేటో..

ఇది ఒక మామూలు ఆర్.ఎం.పి. స్థితి. ఇక నగరానికొస్తే అయిదు నక్షత్రాల వృత్తిలోకి రాగానే వచ్చిన రోగిని జలగల్లా పీల్చెయ్యడాలు.

ఇందున్న మానవతా దృక్పధాన్ని ఈ చదువుల స్థితి. స్వార్థం జయించడంలో శారీరక బాధా నివృత్తికి, వైద్యం కోసం బయలుదేరిన మనిషి కథ.

ఇది ఇప్పుడు నడుస్తున్న తీరు.

రోగి స్థితిగతుల్ని వదిలి అతని శారీరక భాగాల్ని పంచుకుని, అవసరం అనిపించినా లేకున్నా ఎలా పీకి, పీకాలో అలా చేసి మాది మాకిచ్చి వెళ్ళు అనడం వైద్య విధానంగా మారింది. నేను పెరిగిన విజ్ఞానాన్ని తప్పు పట్టడం లేదు. పెరగాలి. అవసరం కూడా దాన్ని క్యాష్ చేసుకుంటూ. న్యాయం చేయలేక పోవడాన్ని ప్రశ్నిస్తాను.

బాధాసర్పద్రష్టుల్ని దండుకోవడాన్ని ప్రశ్నించడం తప్పడం లేదు. తెలివి కలిగిన చదువరులే తమ మేధకు పదునుపెట్టి బందిపోట్ల కంటే అన్యాయంగా తయారవుతున్న ఈ శ్రేయ సమాజాన్ని అడుగుతున్నాను. ఇది న్యాయమేనా? మీరు మీ వృత్తికి న్యాయం చేస్తున్నారా? ఏమిటిది? మనస్సు నిలిపి ఒకసారి ఆలోచించండి. మీరు ఆలోచించక పోతే ప్రభుత్వాన్ని మనిషికి వైద్యం ఎందుకు చేయాలో అడగండి. కనీస బాధ్యత గదా! ✻



### వైభవంగా సుమంత్, కీర్తిరెడ్డిల పెళ్ళి

వెండితెర కథానాయకుడు సుమంత్, కథానాయకి కీర్తిరెడ్డిలు ఒక్కటయ్యారు. ఆగస్టు 20వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన వీరి వివాహమహోత్సవానికి సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై, ఆశీర్వదించారు. వీరి ప్రేమ వ్యవహారం గురించి కొన్నాళ్ళ క్రితం వార్తలు వెలువడ్డాయి. వీరి ప్రేమకి పెద్దలు కూడా పచ్చజెండా ఊపడంతో కథ సుఖాంతమైనట్లయింది. కీర్తిరెడ్డి కుటుంబీకులు రాజకీయరంగానికి చెందినవారవడంతో, పెళ్ళిప్రాంగణం సినిమా, రాజకీయ రంగ ప్రముఖులతో కళకళలాడింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంమంత్రి జానారెడ్డి, హీరో కృష్ణ, చిరంజీవి, మోహన్‌బాబు తదితరులు కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సుమంత్ మేనమామలు అక్కినేని నాగార్జున, వెంకట్‌లు పెళ్ళి ఆద్యంతం పర్యవేక్షించారు.